

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బోయినపల్లి: మండలంలోని కోరెం తదితర 19 గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈవో ఉమారాణి మంగళవారం ఎంపీడీవో జీమా జయశీలతో కలిసి తనిఖీ చేశారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:31	గురు 5:04

గరిష్టం/కనిష్టం
39.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఎంపిక వంటి అంశాలపై మాట్లాడారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మోహినికుంట పోలింగ్ బూత్ సందర్శనలో ఆర్డీవో రమేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ అన్నారు. ముస్తాబాద్ మండలంలోని 45 పోలింగ్ బూత్‌లను మంగళవారం పరిశీలించారు. పోలింగ్ జరిగే గదుల్లో వెలుతురు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలను పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ శ్యామ్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఫొటోగ్రఫీలో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పూజ, ప్రవళిక

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థినులు నిజామాబాద్‌లో నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో సత్తా చాటారు. బి.పూజ ప్రథమ, ఎస్.ప్రవళిక ద్వితీయ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ రజిని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

కరాటేలో సత్తాచాటిన బాలికలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ సమ్మయ్య

సిరిసిల్ల: ఇటీవల వేములవాడలో ఒకినోవా స్పోర్ట్స్ అకాడమీ నిర్వహించిన 4వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. 16 మంది బాలికలు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి అబ్బురపరిచారు. కరాటే మాస్టర్ మామిడాల సమ్మయ్య శిక్షణలో బద్దెనపల్లి పాఠశాలకు చెందిన 16 మంది బాలికలు పతకాలు సాధించడంపై ప్రధానోపాధ్యాయుడు బి.రాజునాయక్ హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన బాలికలను ఉపాధ్యాయులు వీరారెడ్డి, ఎం.శంకర్, మీనాక్షి, పద్మలత, ఎండీ ఖైర్, ఎం.పద్మ, ఎ.సంజీవ్, బి.వినోద్‌కుమార్ అభినందించారు.

వందశాతం ఇంటి పన్ను చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో వంద శాతం ఇంటి పన్ను గడువులోగా చెల్లించాలని డీఎల్పీవో మల్లికార్జున్ కోరారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రూ.25లక్షల ఇంటి పన్ను బకాయిలు ఉండగా.. మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటి పన్ను చెల్లించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి దేవరాజు, జూనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



అభివాదం చేస్తున్న కేసీఆర్, వినోద్‌కుమార్



కరీంనగర్ కదనభేరి సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వేదికపై పోచారం శ్రీనివాస్, మహమూద్ అలీ, వినోద్ కుమార్, కడియం శ్రీహరి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మధుసూదనాచారి, రసమయి బాలకిషన్, సతీశ్‌బాబు, రవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు



రైతులను చూస్తే.. కన్నీళ్లు ఆగట్లే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండిందా?



సభకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు



- చెరువుల్లో మత్తళ్లు దూకిన నీరు మాయమెలా?
- స్మార్ట్‌సిటీ, రైల్వే, రహదారులు తెచ్చిన సమర్థుడు వినోద్
- బండికి, వినోద్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం
- తెలంగాణ గళం కోసం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి
- సిరిసిల్ల ఆత్మహత్యలు ఆపేందుకే బతుకమ్మ చీరలు
- కదనభేరి సభలో కాంగ్రెస్, బీజేపీలపై మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు

కరీంనగర్‌కు బండి చేసిందేంటి?: వినోద్



తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ, జాతీయరోడ్లు, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్, కేబుల్ బ్రిడ్జి, ఐటీ టవర్ తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కేంద్రంతో పోరాడి తీసుకువచ్చామని మాజీ ఎంపీ వినోద్ అన్నారు. ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక నవోదయ ఉండాలని, మన రాష్ట్రంలో బండి సంజయ్ ఒక్క నవోదయ కూడా తేలేకపోయాడని విమర్శించారు. తాను లోక్‌సభలో మొత్తం 106 సార్లు రాష్ట్ర, కరీంనగర్ ప్రయోజనాలపై గళమెత్తానని, బండి సంజయ్ పార్లమెంటులో ఎన్నిసార్లు మాట్లాడారని ప్రశ్నించారు. మొన్న అసెంబ్లీలో ఓడిన వ్యక్తికి పార్లమెంటులో ఏం పని అని? ఇదేమైనా పునరావాస కేంద్రమా? అని నిలదీశారు. సీఎంగా కేసీఆర్ గెలిచి ఉంటే మేడిగడ్డలో దగ్గరుండి మరమ్మతులు చేయించేవారన్నారు.

కేసీఆర్ రాకతో నేల పులకరించింది: గంగుల



కేసీఆర్ కరీంనగర్‌లో అడుగుపెట్టగానే ఈ నేల పులకించిపోయిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీని స్థాపించినప్పుడు కేసీఆర్ కరీంనగర్ గడ్డ నుంచే సింహగర్జన చేశారని, ఆ తర్వాత విజయవంతంగా లక్ష్యాన్ని సాధించారని గంగుల గుర్తుచేశారు. ఉద్యమంలో ఆమరణ దీక్ష నుంచి రైతుబంధు, దళితబంధులాంటి పథకాలకు కరీంనగర్ నేలమీద నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ కరీంనగర్ గడ్డ నుంచే కదనభేరి మోగించేందుకు కేసీఆర్ వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



కేసీఆర్‌కు గద బహూకరిస్తున్న వీర్ల వెంకటేశ్వర్లు



గంగుల నివాసంలో మాటామంతీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

తాను సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండలేదని, మూడునెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పంటలకు నిప్పు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసం కరీంనగర్ కదనభేరి పేరిట నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీబహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్, బీజేపీపై నిప్పులు చెరిగారు. కరీంనగర్ చాలా చైతన్యమున్న గడ్డ అని.. అందుకే తాను పదవులను విసిరికొట్టి ఇదే నేలనుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేపట్టినట్లు గుర్తుచేశారు. కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా, పోరాటాల పురిటిగడ్డ అన్నారు. 2001, మే17న ఇదే ఎస్ఆర్ఆర్ కళాశాల వేదికగా 'సింహ గర్జన' పేరిట నిర్వహిస్తే కరీంనగర్ జనాలు తెలంగాణ జెండాను ఆకాశానికి ఎత్తుకున్నారని గుర్తుచేశారు.మాట ఇచ్చి తప్పడం కాంగ్రెస్‌కు అలవాటేనని, నాడు తమ పొత్తుతో గెలిచావని ఎగతాళి చేస్తే.. రాజీనామా చేసి రెండున్నర లక్షలఓట్ల మెజారిటీతో తాను కరీంనగర్ ఎంపీగా తిరిగి గెలిచానన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే.. దానికి మరమ్మతులు చేయకుండా వదిలేయడమేంటని ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎకరమైనా ఎండలేదని, ఇప్పుడు కరెంటు, నీళ్ల ఎలా మాయమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టి ఎల్ఎండీ, ఎంఎండీలు నింపితే ఎండాకాలం చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. 420 పథకాలు ప్రకటించి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మూడు నెలలకే వాటిని నెరవేర్చలేక తనను తిట్టడం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపేందుకు తాను రూ.50 లక్షలు సేకరించి ఇచ్చానని, వారికి తిరిగి ఉపాధి కల్పించేందుకే బతుకమ్మ చీరలు, పిల్లలకు యూనిఫాంల ఆర్డర్స్ ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఇబ్బందులు పెట్టడమేంటని, తాము అధికారంలో ఉన్నప్పుడు అలాచేసి ఉంటే కాంగ్రెస్ వాళ్లు మిగిలేవాళ్లు కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎవరూ మనస్ఫూర్తిగా జై తెలంగాణ అనలేరని, తెలంగాణ దళం, తెలంగాణ బలం బీఆర్ఎస్సేనని అన్నారు. కరీంనగర్ సహా అన్ని పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.


బండి రూ.10 పనైనా చేసిండా?

కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లు ఉన్న సమయంలో కరీంనగర్‌ను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, జాతీయ రహదారులు, ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు తెచ్చిన సమర్థుడు వినోద్ అని ప్రశంసించారు. ఐదేళ్ల కాలంలో బండి సంజయ్ రూ.పది పని అయినా చేసిండా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయి గోస పడుతున్నారని, మరోసారి అలా అవొద్దని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో ఢిల్లీలో, పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడాలంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.




సభలో రసమయి బాలకిషన్ ఆటాపాట

చి'వరి'కి బీటలు



'ఇది కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన తిక్కల నవీన్ వరి పొలం. మొన్నటి వరకు పొలం బాగానే పారింది. ఒక్కసారిగా భూగర్భజలాలు పడిపోవడంతో బోరు ఎత్తిపోయింది. మూడెకరాల పొలం నిలువునా ఎండింది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రూ.50వేలు మీద పడ్డాయి. పొట్టకొచ్చిన పొలం నిలువునా ఎండినా నవీన్ ఇప్పుడు చేసేది లేక ఆశలు వదులుకున్నాడు. గ్రాసం లేక గొర్రెలను మేపుకునేందుకు వలస వచ్చిన కాపరులకు తన పొలాన్ని అప్పగించాడు. మూడెకరాల పొలం గొర్రెలకు మేతగా మారింది.'



'ఇది కూడా కోనరావుపేట మండలంలోనిదే. నీరు లేక ఎండిన పొలాన్ని గొర్రెల కాపరులు మేపుకుంటున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు చి'వరి' దశలో పొలాలు ఎండిపోవడంతో రైతులు గుండెలు విలవిలాడుతున్నాయి. జిల్లాలో భూగర్భజలాలు ఒక్కసారిగా 10.18 మీటర్లకు పడిపోవడంతో బోర్లు ఎత్తిపోయి నీరు ఇవ్వడం మానేశాయి. ఫలితంగా పచ్చని పొలాలు బీటలు వారాయి. ఇలా ఒక్కటి.. రెండు కాదు.. జిల్లా వ్యాప్తంగా కనిపిస్తున్న కరువు దృశ్యాలు ఇవీ.'

- జిల్లాలో నీరింకిన ఆశలు.. కరువు బాటలు
- 10.18 మీటర్లకు పడిపోయిన భూగర్భ జలం
- మధ్యమానేరులో 12 టీఎంసీల నీరు నిల్వ
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో కరువు ఛాయలు

సాక్షి ఫొటో



నేడు: సిరిసిల్ల మానేరు వాగు.. నీరు లేక ఎడారిలా..



నాడు: సిరిసిల్ల మానేరు వాగు.. మధ్యమానేరు జలాశయం నీటితో జలకళ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంత రైతుల ఆశలు అడుగంటాయి. సముద్ర మట్టానికి 1,250 అడుగుల ఎత్తులో ఉన్న సిరిసిల్ల ప్రాంతంలో కరువుఛాయలు కమ్ముకున్నాయి. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం)లోకి గోదావరి జలాలు ఎత్తిపోయకపోవడంతో జలాశయంలో నీరు లేక పరివాహక ప్రాంతం ఎడారిని తలపిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడంతో ఏర్పడిన ప్రతిబంధకంలో జిల్లాకు సాగునీటి కష్టాలు వచ్చాయి. గతేడాది ఈ సమయంలో మధ్యమానేరులో 25 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఇప్పుడు 12 టీఎంసీలు ఉంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి అన్నపూర్ణ జలాలయంలోనూ నీరు నిల్వ లేదు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు, కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయాల్లోనూ నీటి నిల్వ తక్కువగా ఉంది. ఫలితంగా భూగర్భజలాలు సైతం అడుగంటి రైతులకు సాగునీరు కరువయింది. ఈ యాసంగిలో జిల్లాలో 1.73 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, అంతటా పొట్టదశలో పొలాలు ఉన్నాయి. మరో పక్షం రోజుల నుంచి నెల రోజుల్లో వరి కోతలు మొదలయ్యే అవకాశం ఉండగా.. నీరు లేక పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. ఎండిన పొలాలను రైతులు పశుగ్రాసంగా వదిలేస్తుండగా.. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో సోమవారం ఓ రైతు ఏకంగా ఎండిన పొలాన్ని తగులబెట్టారు. జిల్లాలో రైతుల ఆవేదనకు ఈ ఘటన అద్దం పడుతుంది. ఏది ఏమైనా యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

నేతన్నల కోసం 24 గంటల నిరాహార దీక్షలు



సిరిసిల్ల అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న పవర్‌లూమ్ కార్మిక సంఘం నాయకులు

- ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి
- ధర్నాలో పవర్‌లూమ్ కార్మిక సంఘం నాయకులు

సిరిసిల్ల: వస్త్రపరిశ్రమ, నేత కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 14న సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 24 గంటల నిరాహార దీక్షలు చేస్తామని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిసిల్ల వస్త్రపరిశ్రమ దయనీయ స్థితికి చేరిందని, ఉపాధి లేక కార్మికులు పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు, నేతన్నలకు పని లేక దిక్కులు చూస్తున్నారని వివరించారు. మూతపడిన పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. పని లేక ఆర్థిక ఇబ్బందులతో బీవై నగర్‌కు చెందిన కార్మికుడు తడుక శ్రీనివాస్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ, మూడునెలలుగా వస్త్రపరిశ్రమ బంద్ కావడంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టే నిరాహార దీక్షలలో వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులు, సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జువ్వాజి విమల, గురజాల శ్రీధర్, అన్నల్‌దాస్ గణేశ్, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, పవర్‌లూమ్ నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేశ్, మోర తిరుపతి, వైపని నాయకులు ఎలిగేటి శ్రీనివాస్, ఆసాముల సంఘం నాయకులు సిరిసిల్ల రవి, చేరాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు మహిళల హక్కులను కాలరాస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర(ఐద్వా) జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల అన్నారు. ఐద్వా ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ ఆఫీస్‌లో జెండా ఎగురవేసి మాట్లాడారు. నరేంద్రమోదీ పాలనలో మహిళలపై అనేక అకృత్యాలు పెరిగాయని విమర్శించారు. నేటి మహిళలు రాజకీయంగా ఎదిగి హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం సీట్లు రిజర్వేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరం పద్మ, సంధ్య, శోభ, యశోద, అంజలి తదితరులు పాల్గొన్నారు.